క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా శ్రీనివాస్


వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ సీఐగా సన బోయిన శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన శ్రీనివాస్ ఎస్సైగా జామి, రామభద్రపురం, పూసపాటిరేగ, స్పెషల్ బ్రాంచ్, గరివిడి, సాలూరు టౌన్, తెర్లాంలలో స్టేషన్లతో పాటు సీఐడీ విభాగంలో పనిచేశారు. పదోన్నతిపై సీఐగా రాజాం రూరల్ సర్కిల్‌లో 10 నెలల పాటు పనిచేసి, బదిలీపై వన్‌టౌన్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీసులు, సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందించారు.

అజొల్లాతో నత్రజని


వరి పంటలో అజొల్లా వేస్తున్న హేమసుందర్

విజయనగరం ఫోర్ట్: అజొల్లాతో వరి పంటకు అవసరమైన నత్రజని అందుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి హేమసుందర్ అన్నారు. మండలంలోని కోరుకొండలో గ్రామానికి చెందిన రైతు నాగమణి భూమిలో వేసిన నవధాన్యాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం వరుసక్రమంలో వేసిన వరి పంటలో అజొల్లా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎకరం పొలానికి నాలుగు కిలోల అజొల్లా వేస్తే సరిపోతుందన్నారు. అజొల్లా వేయడం వల్ల యూరియా వాడకం తగ్గించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మహేష్, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

భోగాపురం: మండలంలోని కొంగవానిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 38-13లో సుమారు 1.64 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయనున్న క్వారీని జేసీ కార్తీక్ బుధవారం పరిశీలించారు. భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన మెటల్, పిక్క ఈ క్వారీ నుంచి సమకూర్చనున్నారు. ఈ నేపథ్యంలో జేసీ స్థల పరిశీలన చేపట్టి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఆర్డీఓ సూర్యకళ, మైనింగ్‌శాఖ ఇన్‌చార్జ్ ఎ.డి విజయలక్ష్మి, జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనస్తీషియాపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో అనస్తీషియా విద్యార్థులకు ఆయా కోర్సులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీసీ పీకే మహంతి మాట్లాడుతూ.. చదువు పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటే భవిష్యత్‌లో అద్భుతాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేసారి మూడు కొలువులు..


పతివాడ కిరణ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చనమల్లుపేట గ్రామానికి చెందిన యువకుడు అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఒకేసారి మూడు బ్యాంకుల్లో ఉద్యోగాలు సాధించి తోటి యువతకు ఆదర్శంగా నిలిచాడు. గ్రామానికి చెందిన పతివాడ కిరణ్ ఇటీవల ఎస్‌బీఐ క్లర్క్, సప్తగిరి బ్యాంక్ క్లర్క్ ఉద్యోగాలతో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా పీఓగా ఎంపికయ్యాడు. పదో తరగతి వరకు అలుగోలు ఉన్నత పాఠశాలలో చదువుకున్న కిరణ్ ఇంటర్, డిగ్రీ చదువును ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కొనసాగించాడు. తల్లిదండ్రులు నారాయణ స్వామి, సూరప్పమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం బీఓఐ పీఓగా శిక్షణ తీసుకుంటున్నాడు.

భోగాపురంలో గంజాయి కలకలం

భోగాపురం: మండల కేంద్రమైన భోగాపురంలో గంజాయి విక్రయం కలకలం రేపింది. మండలంలోని రావాడ గ్రామానికి చెందిన యువకుడు వేరే ప్రాంతం నుంచి గంజాయిని తీసుకునివచ్చి భోగాపురంలో నివాసముంటున్న కొంతమంది యువకులకు విక్రయిస్తున్నట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు బుధవారం మాటువేసి గంజాయి విక్రయిస్తున్న యువకుడితో పాటు కొనుగోలు చేసిన నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారిస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

పాఠశాల ఎన్నికల్లో రాజకీయ జోక్యం

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్లో చోటుకు ఆరాటం
- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న కూటమి నాయకులు
- నేడు పాఠశాలలో జరగనున్న ఎన్నికలు

విజయనగరం నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు	
నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య:	123
ఉన్నత పాఠశాలల సంఖ్య:	16
ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య:	9
ప్రాథమిక పాఠశాలల సంఖ్య :	98
ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య:	15,724


విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ప్రాథమిక పాఠశాల

విజయనగరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అంశంలోనూ అనవసర రాజకీయ జోక్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే పథకాల విషయంలో కూటమి నాయకులు హంగామా చేస్తుండగా, రాజకీయాలకు పూర్తి దూరంగా నిర్వహించాల్సిన ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో సైతం తమ పార్టీల నాయకులు, సానుభూతిపరులు పదవుల్లో ఉండే విధంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులు పేరు చెప్పుకుని కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ఎన్నికల్లో పంతం నెగ్గించుకునేలా ముమ్మర ప్రయత్నాలు చేయటం గమనార్హం. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా సెక్షన్ 21 ప్రకారం పాఠశాలల్లో విద్యా కమిటీలను నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పదవీకాలం ముగియడంతో కొత్తగా పేరెంట్స్ కమిటీల స్థానంలో నూతనంగా ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)గా పేరు మార్చి ఆగస్టు ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

మార్గదర్శకాలు ఇలా..

ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరుకావాలి. ఎన్నికలు సాధారణంగా చేతులు ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహిస్తారు. అపరిష్కృత వివాదాలు, అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబించాల్సి ఉంటుంది. విద్యార్థి తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. కమిటీలో కనీసం ఒకరు వెనుకబడినవర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. ఈ ఎన్నికల్లో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయి.

ఎన్నిక ప్రక్రియ నిర్వహించేది ఇలా...

- ఎనిమిదో తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక ఉంటుంది.
- ప్రతి తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రులను ముగ్గురు చొప్పున ఎన్నుకోవాల్సి ఉంటుంది.
- ఇలా ఎన్నికైన 15 మంది సభ్యుల నుంచి అదేరోజు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుంది.
- 2 గంటలకు ప్రమాణ స్వీకారం, 3.30 గంటల్లోపు తొలి సమావేశం నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల సందడి..


ఎస్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధమైన పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- కమిటీలపై కన్నేసిన కూటమి నేతలు..

పూసపాటిరేగ : ప్రభుత్వపాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల సందడి నెలకొంది. గురువారం నిర్వహించాల్సిన ఎన్నికకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలో 296 పాఠశాలలు ఉండగా అందులో 223 ప్రాథమిక, 21 ప్రాథమికోన్నత, 52 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ ఎన్నికలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. మండల తహసీల్దార్, ఎంపీడీఓ ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లలు సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు.

దృష్టి సారించిన అధికార పార్టీ నేతలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. వారికి చెందిన వ్యక్తులనే చైర్మన్లుగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు. రాజకీయాలకతీతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతుండగా.. అధికార పార్టీ నాయకుల తీరు అధికారులకు తలనొప్పిగా మారింది.

నిష్పక్షపాతంగా..

ఎస్‌ఎంసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపిస్తాం. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులనే కమిటీ సభ్యులుగా, చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పాఠశాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసే ఈ కమిటీలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తాం. 8వ తేదీన ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు.

– రాజ్‌కుమార్, ఎంఈఓ-1, పూసపాటిరేగ మండలం.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ..

విజయనగరం నియోజకవర్గ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. నియోజకవర్గ స్థాయిలో తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నిక ప్రక్రియలో పాల్గొనేలా ఇప్పటికే చైతన్యం కల్పించాం.

– ఆనందమూర్తి, మండల విద్యాశాఖ అధికారి-1, విజయనగరం.

అనుమతులు తప్పనిసరి

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు


26వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టే భవన నిర్మాణాలకు సంబంధించి ప్రతిఒక్కరూ అనుమతులు తీసుకోవాల్సిందేనని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు స్పష్టం చేశారు. నగరంలోని 26వ డివిజన్ కోరాడవీధి, ఎలుగుబంటివారి వీధి, తదితర ప్రాంతాలలో బుధవారం పర్యటించి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులు ఉన్నాయా, లేదా అని సంబంధిత కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖాళీ స్థలాలకు పన్ను విధింపు చేపట్టారా, లేదా అని ఆరా తీశారు. నిరుపయోగంగా పడి ఉన్న పాత్రల్లో వర్షపు నీరు చేరి నిల్వ ఉండడానికి గమనించి సంబంధిత పారిశుధ్య కార్మికులు, కార్యదర్శులను మందలించారు. ఏ ప్రాంతంలోనైనా నీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత కార్యదర్శులపై ఉందన్నారు. ప్రతి నిర్మాణానికి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులచే అనుమతులు తీసుకోవాలన్నారు.

నేడు వార్డు పర్యటన

విజయనగరం: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేషన్ పరిధిలోని నాలుగో డివిజన్‌లో గురువారం వార్డు పర్యటన నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో పాటు కార్పొరేషన్ అధికారులు పాల్గొంటారని, స్థానికులు సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అవయవదానం మిన్న

- తిరుమల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. స్వాతి

విజయనగరం ఫోర్ట్ : అవయవ దానానికి మించిన దానం లేదని తిరుమల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. స్వాతి అన్నారు. నర్సింగ్ కళాశాలలో అవయవదానంపై బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒకరి అవయవదానంతో మరో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసందర్శన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బూరాడపేట పంచాయతీలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రావాడలో..

భోగాపురం: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు మండలంలోని రావాడ గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

జానపద కళలను కాపాడుకోవాలి

- జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు


మాట్లాడుతున్న జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు

విజయనగరం టౌన్: అంతరించిపోతున్న జానపద కళలను కాపాడి, భావితరాలకు అందించాలని జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలో ఉన్న ధవళ కనకవేదికలో నవచైతన్య కళామండలి, గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో కళాకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శివభాగవతం, తప్పెటగుళ్లు, జముకు, చెక్క భజన, డప్పు, జాలరి నృత్యం, పల్లె పదాలు వంటి కళాకారులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కళలను కాపాడి కళాకారులకు జీవనభృతిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నవచైతన్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.చినరెడ్డి, అట్టాడ లక్ష్మీనాయుడు, చిలకాం జ్యోతి బృందం, కళాకారులు మారినాయుడు, పి.సంతు, చినరెడ్డి, తవుడు, బద్రి, డప్పు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి


మొక్కలు నాటుతున్న యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజేశ్వరి

విజయనగరం అర్బన్: మానవుల మనుగడ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం అందరి బాధ్యతని జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజేశ్వరి అన్నారు. యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త వి.మణికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఎస్.వేణుగోపాలరావు, కె.శ్రీనివాసరావు, ఎల్.హరిప్రకాష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

- ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి ఈశ్వరయ్య

విజయనగరం పూల్‌బాగ్: ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర మహాసభలు విజయనగరం కేంద్రంగా నవంబర్ 27 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం స్థానిక అమర్‌భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ, పీడిత ప్రజల విముక్తికి సాగిన ప్రతి సమరంలో విద్యార్థుల త్యాగాలే ముందుంటాయన్నారు. ఆహ్వాన సంఘ అధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. కవులు, కళాకారులు, రచయితలు, విద్యావేత్తలు, స్వాతంత్ర్య ఉద్యమకారులకు నిలయమైనటువంటి విజయనగరంలో ఏఐఎస్‌ఎఫ్ మహాసభలు జరగడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ షేక్ మస్తాన్, ఫణీంద్ర, సాయికుమార్, కుల్లాయి స్వామి, నాగభూషణం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, ఆనందరావు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి. శ్యామ్ , జిల్లా కార్యదర్శి సూరిబాబు, ఉత్తరాంధ్ర ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు పి.నరసింహులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, రఘు విద్యాసంస్థల కరస్పాండెంట్ డి. రఘు, ప్రజాసంఘాల ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


చేనేత కార్మికుల్ని సన్మానిస్తున్న నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి పద్మశాలి వీధిలోని మార్కండేయ భవనంలో జాతీయ చేనేత దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు జి రాము, జిల్లా యువజన అధ్యక్షుడు సప్పా ప్రసాద్ మాట్లాడుతూ.. చేనేతలపై జీఎస్‌టీ తొలగించి నేతన్నలను ఆదుకోవాలని కోరారు. అలాగే నూలుపై సబ్సిడీ ఇవ్వడంతో పాటు నేత కార్మికులను ఆదుకోవాలన్నారు. అనంతరం 21 మంది కార్మికులకు సన్మానం చేయడంతో 11 మంది మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో టి. వెంకటేశ్వరరావు, సుధీర్, ఐవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె. బలరామ్, టి. అప్పలరాజు, ఎం. నారాయణ, టి. ప్రసాద్, తదితరుల పాల్గొన్నారు.

నైపుణ్యాలపై పట్టు పెంచుకోవాలి

- జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్


మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ చదువులే కాకుండా నైపుణ్యాలకు సంబంధించిన కోర్సులపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అన్నారు. గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన 2024-25 విద్యా సంవత్సర ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇంజినీరింగ్ కోర్సులతో పాటు ఉపాధి, ఉద్యోగాలను ఇచ్చే నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లల చదువు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, బొత్స పూజిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, మొదటి సంవత్సర విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

- సీడీపీఓ ఎస్తేరురాణి


పూసపాటిరేగ : గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీఓ ఎస్తేరురాణి, తదితరులు

పూసపాటిరేగ : గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ భోగాపురం సెక్టార్ పీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తిప్పలవలస అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రతి తల్లి కూడా బిడ్డకు పాలివ్వడం ప్రకృతి ధర్మమని, మిగతా ఏ విధమైనా పౌష్టికాహారం కూడా తల్లిపాలకు సాటి రాదన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ సోకే ప్రమాదం తగ్గడంతో పాటు చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ బి. తవిటినాయుడు, సూపర్‌వైజర్ సత్యవతి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



విజయనగరం ఫోర్ట్: సమావేశంలో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

బిడ్డను వెయ్యి రోజులు పర్యవేక్షించాలి..

విజయనగరం ఫోర్ట్: జన్మించిన దగ్గర నుంచి బిడ్డను సుమారు వెయ్యి రోజుల పాటు ఆరోగ్యపరంగా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక మహిళా ప్రాంగణంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించిన వరకు ఫాస్ట్‌ఫుడ్, టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ బి. శాంతకుమారి మాట్లాడుతూ .. బిడ్డ కడుపులో పడిన దగ్గర నుంచి సురక్షితంగా ప్రసవించిన వరకు అనేక ఆరోగ్య సూత్రాలు, ఆహారపు అలవాట్లు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి విజయకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యానారాయణ, డీపీహెచ్‌ఎన్‌ఓ మామిడి సత్యవతి, మెప్మా అధికారి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చట్ట సవరణలను వ్యతిరేకిస్తున్నాం..

విజయనగరం టౌన్: కేంద్ర, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చట్టాలపై సవరణలు జరిపించాలనుకోవడం సరికాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లా మైనార్టీలందరూ వ్యతిరేకిస్తున్నారని వాక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత చట్టాలపై సవరణ చేయడం మంచిది కాదని, వాటివల్ల రాజకీయంగా ఇబ్బందులేర్పడతాయని పేర్కొన్నారు.